క్లుప్తంగా

జిల్లాకు చేరిన 40 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: వ్యవసాయ సర్వీసులకు 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు 40 గురువారం స్టోర్స్‌కు వచ్చినట్లు ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. పెండింగ్ సర్వీసుదారులకు సీనియారిటీ ప్రకారం వీటిని అందజేయాలన్నారు. సంబంధిత ఏఈలు వర్క్‌ఆర్డర్లు పెట్టి మెటీరియల్ డ్రా చేసుకోవాలని వివరించారు.

నేడు అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు


వీరాంజనేయస్వామి

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. ఉదయం స్వామికి అర్చకులు అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించనున్నట్లు వివరించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకుటారని తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయ మండపంలో స్వామికి సుదర్శన హోమం భక్తితో నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని పేర్కొన్నారు. వేడుకలు తిలకించడానికి విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు. రాత్రి 8 గంటలకు ప్రాకారోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు


ఎ.గొల్లపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు ఇంటి ముంగిటకే వైద్య సేవలందిస్తున్నామని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ఎ.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 35 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల అందజేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి


వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న మెరుగైన వైద్యసేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నెల్లిమందపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు


మొక్కలు నాటి నీరు పోస్తున్న పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు

గంగవరం: మొక్కలు నాటి సంరక్షిస్తే అవే పెద్ద వృక్షాలై భావి తరాలను కాపాడుతాయని పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు అన్నారు. మండలంలోని జీఎల్‌ఎస్‌ఫాం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. సభ్యులు మాట్లాడుతూ, వర్షాకాలం దృష్ట్యా విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. మానవాళి మనుగడ పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని అందరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. పలమనేరు ఫారెస్ట్ రేంజర్ శివన్న, పలమనేరు పరిరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు ఆనంద బాబు, సంస్థ అధ్యక్షుడు సుబ్రమణ్యంపిళ్లై, కార్యదర్శి నరసింహులు సేవారత్న శ్రీపురం సీతారామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెంగప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. వ్యాధుల గాలం



గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది, తగ్గువారిపల్లెలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది(ఫైల్)

- జ్వరాల వ్యాప్తికి ఆస్కారం
- సీజనల్ రోగాలపై అప్రమత్తం
- పరిసరాల పరిశుభ్రత ముఖ్యం
- జాగ్రత్తలు పాటించాలన్న వైద్యులు

బంగారుపాళెం: వర్షాకాలం వచ్చిందంటే వ్యాధుల కాలం ఆరంభమైనట్లే. వాతావరణంలో మార్పులతో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. అపరిశుభ్రత, ఆహారంలో లోపాల కారణంగా రోగాలు వస్తాయి. ముందు జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి నిల్వ ఉండడంతో వ్యాధి కారకాలైన దోమలు, సూక్ష్మక్రిములు, బాక్టీరియా వృద్ధి చెందుతాయి. వానాకాలంలో సాధారణ జ్వరం దగ్గర నుంచి ప్రమాదకరమైన డెంగీ వరకు సోకే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

వైరల్ జ్వరాలు

సీజన్ మార్పుతో పెరిగే సూక్ష్మక్రిముల వల్ల వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. గాలి, నీరు ద్వారా సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి జ్వరం వస్తుంది. కొందరికి జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు ఉంటాయి. వైరల్ జ్వరం మూడు రోజులు నుంచి వారం రోజుల వరకు ఉంటుంది.

జాగ్రత్తలు

- భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- నిల్వ పదార్థాలు తినరాదు
- తాజా, వేడి ఆహారం తీసుకోవాలి.

చికున్ గున్యా

దోకాటు వల్ల చికున్ గున్యా వస్తుంది. తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు చికున్ గున్యా లక్షణాలు రోజు రోజుకూ జ్వరతీవ్రత పెరుగుతోంది.

జాగ్రత్తలు

- ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- కూలర్లు, టైర్లు తదితరాల వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- శరీరం మొత్తం కప్పేలా దుస్తులు ధరించాలి.
- రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

మలేరియా

ఆడ అనాఫిలస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాపిస్తుంది. దోమ కాటు వల్ల దాని లోపల ఉన్న మలేరియా క్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయి. 14 రోజుల తరువాత తీవ్ర జ్వరం వస్తుంది. ఈ దోమలు నిల్వ ఉన్నవర్షం నీటిలో వృద్ధి చెందుతాయి.

జాగ్రత్తలు

- దోమ కుట్టకుండా దోమతెరలు వినియోగించాలి.
- నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- నిల్వ ఉన్న నీటిలో కిరోసిన్ గాని పురుగుల మందు కానీ కలపాలి.

డెంగ్యూ

ఈడిస్ అనే దోమ కాటు వల్ల డెంగ్యూ వ్యాపిస్తుంది. వైరల్ మాదిరిగా ఆకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తల నొప్పి, ఒళ్లు నొప్పులు, ఎముకలు విరిగేటంత నొప్పింటుంది. ఒక్కసారిగా శరీర అంతర భాగాల్లో రక్తస్రావం ఉంటుంది. కాళ్లు, చేతులు, ముఖం, వీపు, ఉదర భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లు చిన్నపాటి పొక్కులు వస్తాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయి రోగి పరిస్థితి విషమంగా మారుతుంది. కుండీలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు వంటి వాటిల్లో చేరిన వర్షం నీటిలో ఈడిస్ దోమలు వృద్ధి చెందుతాయి.

జాగ్రత్తలు

- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- దోమ తెరలు వాడడం మేలు.
- వారంలో ఒక్క రోజు డ్రైడే పాటించాలి.
- దోమలు కుట్టకుండా శరీరం కప్పేలా దుస్తులు వేసుకోవాలి.
- జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

హెపటైటిస్–ఎ

వర్షాకాలంలో హెపటైటిస్–ఎ(కామెర్లు)వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. కలుషితమైననీరు, ఆహారం ద్వారా ఈ వ్యాధికి సంబంధించిన సూక్ష్మక్రిములు శరీరంలోకి వ్యాపిస్తాయి. ఇది కాలేయ కణాల్లో సంక్రమిస్తుంది. కాలేయ వ్యాధి కారణంగా రక్తంలో 'బిలిరుబిన్' పరిమాణం పెరుగుతుంది. తద్వారా శరీర భాగాలు పసుపు రంగులో కనిపిస్తాయి.

జాగ్రత్తలు

- శుభ్రమైన ఆహారం తీసుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలి.

టైఫాయిడ్

టైఫాయిడ్ 'సాల్మొనెల్లా టైఫి' బ్యాక్టీరియా వల్ల వస్తుంది. కలుషితమైన నీరు, ఆహారం వల్ల టైఫాయిడ్ వ్యాపిస్తుంది.

జాగ్రత్తలు

- కాచి చల్లార్చిన నీళ్లు తాగడం ఉత్తమం.
- రోజుకు 3 నుంచి 4 లీటర్లు నీళ్లు తాగాలి.
- పండ్ల రసం, కొబ్బరినీళ్లు, సూప్ వంటివి తీసుకోవాలి.
- వైద్యులసూచనల మేరకు వైద్యసేవలు పొందాలి.

సకాలంలో వైద్యం

జ్వరాలకు స్థానికంగా, సకాలంలో వైద్యం అందించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అన్నిరకాల రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నారు. జ్వరాలపై జరుగుతున్న సర్వే ప్రకారం కేసులు ఎక్కువ ఉన్న గ్రామాలు, వార్డుల్లో వైద్య క్యాంపుల ఏర్పాటుకు వైద్యారోగ్య శాఖ అధికారులు తీసుకుంటున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సోకే సమయం కావడంతో జ్వరం కేసులు ఉంటే వెంటనే స్థానిక పిహెచ్‌సీలు, సిహెచ్‌సీల్లో ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించి సకాలంలో వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలి. శుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవాలి. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలి.

–డాక్టర్ లోహిల్‌వెంగల్‌రాయన్, తుంబకుప్పం పీహెచ్‌సీ, బంగారుపాళెం

చిత్తూరులో మోస్తరు వర్షం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. కురిసిన వర్షానికి రోడ్లంతా జలయమంగా మారాయి. కురుస్తున్న వర్షాలకు కాలువ నిండి చెరువులకు నీరు పారుతోంది. ఉదయం నుంచి మధ్యా హ్నం వరకు కూడా ఎండ తీవ్రత అధికంగా ఉంది. భరించలేని ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు.

సకాలంలో వైద్యసేవలు


సేవలు అందిస్తున్న వైద్యులు

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని తుమ్మిందపాళెంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం గర్భిణులు, షుగర్ పేషెంట్లకు వైద్యం చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 66 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్ర, రాజేశ్వరి, నందిని, నిరోషా పాల్గొన్నారు.

తపోవనం ఆశ్రమానికి విరాళం


బ్యానర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని తపోవన వృద్ధుల ఆశ్రమానికి గురువారం ఎస్‌బీఐ స్టేట్ యూనియన్ సభ్యులు నగదు విరాళం చేశారు. రూ.10 వేల ఆశ్రమ నిర్వాహకుల చేతికి అందించారు. ఈ నెల 23న ఓ ప్రైవేటు హోటల్లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు శస్త్రగిరి జీషన్ బాషా, రాజేష్, ఉమేష్, దిలీప్, శంకర్, జయచంద్ర పాల్గొన్నారు.

శేషుడిపై శ్రీమన్నారాయణుడి విహారం


స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న ఉభయదారులు


శేష వాహనంపై విహరిస్తున్న శ్రీమన్నారాయణుడు

- భక్తితో స్వామికి ఊంజల్‌సేవ, తిరుమంజనం, పాలాభిషేకం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీ కోదండరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీమన్నారాయణుడు గురువారం రాత్రి శేష వాహనం భక్తులకు అభయమిచ్చారు. ఆలయంలో వేదపండితులచే ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం చేయించారు. సుగంధపరిమళ పుష్పాలు, శేషవస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేయించారు. స్వామికి పూజలు చేయించి ధూప దీపనైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామికి ఉభయదారులు శివశంకర్‌రెడ్డి కుటుంబసభ్యులచే తిరుమంజనం, ఉభయదారులు శరవణభవ రెడ్డి కుటుంబసభ్యులు పాలాభిషేకం చేయించారు. సాయంకాలం ఉభయదారులు కరుణాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు ఊంజల్‌సేవను నిర్వహించారు.

శేషవాహనంపై ఊరేగుతూ..

సాయంత్రం ఆలయానికి ఉభయదారులు సాంబశివారెడ్డి కుటుంబసభ్యులు స్వామికి పూజాసామగ్రి, సుగంధపుష్పాలు, ప్రసాదాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు, అర్చలు చేయించి నైవేద్యం సమర్పించారు. విద్యుద్దీపాలు, సుగంధపుష్పాలతో అందంగా రూపుదిద్దుకున్న శేష వాహనంపై శ్రీమన్నారాయణుడు కొలువుదీరారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ పురవీధుల్లో విహరిస్తూ భక్తులు కటాక్షించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళ హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

సీతారాముల కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం సీతారాముల కల్యాణోత్సవం, కల్యాణతిరుక్కోణం, ఊంజల్ సేవను వైభవంగా నిర్వంహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి. సిద్దేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు. రాత్రిలో గరుడ వాహన సేవ ఉంటుందని వివరించారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ సుబ్రమణ్యం

తవణంపల్లె: ఉపాధి పనులను వేగవంతం చేయాలని డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని అరగొండ, దిగువ తడకరలో గురువారం కొనసాగుతున్న ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన ఉపాధి పనుల దగ్గర ఉన్న కూలీలతో మాట్లాడారు. కందకాలు తవ్విన ప్రాంతాల్లో మొక్కలు నాటించాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీలకు రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే విధంగా పనులు చేయించాలని సూచించారు. ఉపాధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీడీతో పాటు ఏపీఓ లలిత, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో తిరగాలి



తవణంపల్లెలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సమావేశానికి హాజరైన అధికారులు

తవణంపల్లె: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆయన గురువారం సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది గ్రామాలను సందర్శించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, పైపులైన్లు లీకేజ్, డ్రైనేజీ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. వర్షాకాలంలో వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని, పారిశుధ్యంపై దృష్టి సారించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఎక్కడికి వెళ్లినా మూమెంట్ రిజిస్టర్‌లో తప్పకుండా ఎంట్రీ చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్లకు యుద్ధప్రాతిపదకన మరమ్మతు చేయించాలని చెప్పారు. గ్రామాల్లో రాత్రుల్లో వీధి లైట్లు వెలుగుతున్నాయా లేదా, లైట్లు వెలగకుంటే ప్రజల సౌకర్యార్థం వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. సచివాలయాల్లో ప్రభుత్వ సేవలను కొనసాగించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కేన్సర్ నిర్ధారణ పరీక్షలపై సిబ్బందికి శిక్షణ



శిక్షణ పొందిన ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం కాంప్రెస్సీవ్ కేన్సర్ కేర్ రెండవ విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైద్యాధికారి ప్రవీణా మాట్లాడుతూ 30 ఏళ్లు పైబడిన వారికి వివిధ రకాల సర్వైకల్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, ఓరల్ కేన్సర్‌పై స్క్రీనింగ్ ఏ విధంగా చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కుమార్‌రాజా, వైద్యాధికారులు వెంకటేశ్వర రావు, శారద, పూర్ణలత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు భక్తుల పాదయాత్ర

గంగవరం: మండలంలోని చౌడిరెడ్డిపల్లె పంచాయతీ బత్తనపల్లె, చౌడిరెడ్డిపల్లె, మిట్టమీదకురప్పల్లె గ్రామాల నుంచి దాదాపు వంద మందికి పైగా తిరుమలకు పాదయాత్రగా గురువారం బయలుదేరి వెళ్లారు. ప్రతి ఏటా బాగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని మొక్కుబడితో తామంతా తిరుమల శ్రీవారి దర్శనార్థం వెళ్తున్నట్లు చెప్పారు. గోవింద నామస్మరణ, పండరీ భజనల నడుమ భక్తుల పాదయాత్ర కోలాహలంగా సాగింది. ఆదివారం తిరుమలకు చేరుకుని అక్కడ స్వామివారిని దర్శించుకుంటామన్నారు.

మున్సిపాలిటీలో ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

పలమనేరు: మున్సిపాలిటీలోని ఉర్దూ స్కూల్, గొబ్బిళ్లకోటూరు ప్రైమరీ పాఠశాలలను స్థానిక ఎంఈఓ లీలారాణి గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అకడమిక్‌కు సంబంధించిన అన్ని రికార్డులను అప్‌డేట్‌గా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో అన్ని సౌకర్యాలున్నాయని, విద్యార్థుల రాణించేలా వారిలో సామర్థ్యాలను పెంపొందించేందుకు టీచర్లు కృషి చేయాలన్నారు. ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

మురుగు నీటిలో కార్మికుల నివాసాలు

చిత్తూరు అర్బన్: తెల్లవారు జామునే నిద్రలేచి ఊరిని శుభ్రం చేయడానికి వెళ్లే కార్మికులు నివసించే కాలనీ అది. ఊర్లో ఉన్న చెత్తా చెదారం, కాలువల్లోని మురుగును శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులు ఉంటున్న వీధిని మాత్రం కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడంలేదు. చిన్నపాటి వర్షం పడితేచాలు.. కాలువల్లోని మురుగునీళ్లంతా కాలనీలోని ఇళ్లలోకి చేరుతున్న పరిస్థితి. దీన్ని బాగుచేయాలని జాతీయ సఫాయి కర్మచారి చైర్మన్ స్వయంగా మునిసిపల్ యంత్రాంగాన్ని ఆదేశించారు. ధిక్కార స్వరమో, చేయకూడదనుకున్నారో తెలియడంలేదు. కార్పొరేషన్ అధికారులు ఇప్పటికీ సమస్యను పట్టించుకోవడంలేదు.

నగరంలోని 8వ డివిజన్ పరిధిలో ఉన్న వెంగళరావు కాలనీలో పదుల సంఖ్యలో మునిసిపల్ పారిశుధ్య కార్మికులు నివసిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం కొందరి స్వార్థపూరిత ఆలోచన వల్ల సత్యనారాయణపురం, కొంగారెడ్డిపల్లె, రీడ్స్‌పేట మీదుగా వచ్చే మురుగునీటి కాలువను వెంగళరావు కాలనీ మీదుగా నిర్మించారు. అది కూడా సక్రమంగా లేదు. పల్లపు ప్రాంతం వైపు ప్రవహించాల్సిన మురుగునీరు, ముందుకు కదలదు. ఫలితంగా వర్షం పడితేచాలు, మిట్ట ప్రాంతాల్లోంచి వచ్చే మురుగునీరు ఒక్కసారిగా ఉప్పొంగి, వెంగళరావు కాలనీలోకి వచ్చేస్తోంది. ఈ నీళ్లంతా ఒక్కోసారి కార్మికులు కాపురముంటున్న ఇళ్లలోకి వచ్చేస్తుంటుంది. మురుగునీటిని బయటకుపోసి, తేమ ఆరిన తరువాత అందులోనే పడుకోవాల్సిన పరిస్థితి. వర్షం పడ్డ ప్రతీసారి ఇదే సమస్య ఎదురవుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువను రీడ్స్‌పేట నుంచి షర్మన్ పాఠశాల వైపు మళ్లించాలనే ప్రతిపాదన వచ్చింది. వెంగళరావు కాలనీలో రెండు మార్లు పర్యటించిన జాతీయ సఫాయి కర్మచారి చైర్మన్ వెంకటేశన్ దృష్టికి ఈ సమస్య వెళ్లింది. యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలని ఆయన మునిసిపల్ అధికారులను ఆదేశించారు. అయినా సరే సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. నగరాన్ని సుందరీకరణ చేసే విషయం అటుంచితే, సంస్థలో పనిచేసే ఉద్యోగుల బాగోగులను పట్టించుకోవాలనే విమర్శలు వస్తున్నాయి.



వెంగళరావు కాలనీ కూడలి వద్ద కాలువ నుంచి పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు, వెంగళరావు కాలనీలో ప్రవహిస్తున్న కాలువ మురుగునీరు

సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదుల పుస్తకం పెట్టండి


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యలు తెలపడానికి వీలుగా సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదుల పుస్తకం పెట్టాలని ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఈఈ మునిచంద్ర తెలిపారు. రెడ్డిగుంట సెక్షన్ కార్యాలయం, సబ్‌స్టేషన్‌ను ఆయన గురువారం పరిశీలించి మాట్లాడారు. సబ్‌స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏఈ విశ్వప్రసాద్‌ను ఆదేశించారు. ప్రాంగణం పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉంచుకోరాదన్నారు. తరచూ శుభ్రం చేస్తుండాలని చెప్పారు. పెండింగ్‌లోని వర్క్‌ఆర్డర్లను పూర్తి చేయాలని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో వస్తున్న ఫిర్యాదులను పర్యవేక్షించడానికి డీఈని నియమించినట్లు తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు వారు పరిశీలిస్తుంటారని చెప్పారు. వర్షం వచ్చినప్పుడు సమస్య వస్తే క్షేత్రస్థాయి సిబ్బంది పరిష్కరించాలన్నారు.